## 341 వ అధ్యాయం

# ٣٤١ ـ بَابُ كَرَاهَةِ الالْتِفَاتِ فِي الصَّلاَةِ لِغَيْرِ عُذْرٍ

## అకారణంగా నమాజ్‌లో దిక్కులు చూడటం అవాంఛనీయం

١٧٥٧ ـ عَنْ عَائِشَةَ رَضِيَ اللهُ عَنْهَا قَالَتْ: سَأَلْتُ رَسُولَ اللهِ ﷺ عَنِ الالْتِفَاتِ فِي الصَّلاةِ فَقَالَ: «هُوَ اخْتِلاسٌ يَخْتَلِسُهُ الشَّيْطَانُ مِنْ صَلاةِ الْعَبْدِ» رَواهُ الْبُخاري.

1757. హజ్రత్ ఆయిషా (రజి.అన్హా) కథనం: నేను దైవప్రవక్త (సల్లం) ను నమాజులో దిక్కులు చూడటం గురించి అడిగాను. దానికాయన సమాధానమిస్తూ, "అదొక దాడి. ఆ విధంగా దాడి చేసి షైతాన్ దాసుని నమాజులోని కొంతభాగాన్ని ఎత్తుకెళ్ళి పోతాడు" అని చెప్పారు. (బుఖారీ)

*(సహీహ్ బుఖారీలోని అజాన్ ప్రకరణం)*

### ముఖ్యాంశాలు

దాడి చేయటం, ఎత్తుకెళ్ళటం అంటే మనిషి అప్రమత్తంగా లేనప్పుడు అతని వద్ద నుంచి ఏదయినా వస్తువు లాక్కెళ్ళటం అని అర్థం. మనిషి నమాజ్ సమయంలో ఏకాగ్రత లేకుండా దిక్కులు చూస్తున్నట్లయితే అతను నమాజ్‌లో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు భావం. షైతాన్ కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అతని నమాజును ప్రభావరహితంగా మార్చివేయటానికి ప్రయత్నిస్తాడు.

١٧٥٨ ـ وَعَنْ أَنَسٍ رَضِيَ اللهُ عَنْهُ قَالَ: قَالَ لِي رَسُولُ اللهِ ﷺ: «إِيَّاكَ وَالالْتِفَاتَ فِي الصَّلاةِ؛ فَإِنَّ الالْتِفَاتَ فِي

1758. హజ్రత్ అనస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) నాకు ఈ విధంగా ఉపదేశించారు: నమాజులో దిక్కులు చూడకుండా జాగ్రత్తపడు. ఎందుకంటే నమాజులో దిక్కులు చూడటం వినాశ కరం. ఒకవేళ తప్పదనుకుంటే నఫిల్

الصَّلاةِ هَلَكَةٌ، فَإِنْ كَانَ لا بُدَّ، فَفِي التَّطَوُّعِ لا فِي الْفَرِيضَةِ». رواه الترمذي وقال: حديثٌ حسنٌ صَحِيحٌ.

నమాజుల్లో చూడు. ఫర్జ్ నమాజుల్లో మాత్రం వద్దు. (తిర్మిజీ దీనిని వెలికితీసి హసన్, సహీహ్‌గా పేర్కొన్నారు)

(సుననె తిర్మిజీలోని సలాత్ అధ్యాయాలు)

## ముఖ్యాంశాలు

ఈ హదీసుకు సంబంధించి తిర్మిజీగారి బూలాఖ్ ప్రతిలో కేవలం 'హదీసున్ హసనున్' అని మాత్రమే ఉందనీ, దాని పాదవ్యాఖ్యానంలో 'హసనున్ గరీబున్' అని ఉందని షేఖ్ అల్‌బానీ అభిప్రాయపడ్డారు. ఈ హదీసు ఆధారాల్లో బలహీనత ఉంది. అదీగాక దీని పరంపరలో ఒకచోట లింకు తెగింది. ఇది 'జయీఫ్' హదీసు. కనుక తిర్మిజీగారి రెండో మాటే సరైనదని ఆయన అన్నారు. (అల్‌బానీ పరిశోధిత రియాజుస్సాలిహీన్ గ్రంథం)

ఈ హదీసు ఆధారపరంగా ప్రామాణికం కానందున నఫిల్ నమాజుల్లో దిక్కులు చూసే అనుమతి కూడా ఉండదు. మరీ అవసరమనుకుంటే కేవలం ముఖం మాత్రం తిప్పి చూడవచ్చు. రొమ్ము మాత్రం ఖిబ్లాకు అభిముఖంగానే ఉండాలి. రొమ్ము గనుక తిరిగితే నమాజ్ భంగం అయిపోతుంది.